# ప్రశ్నార్థకం

## "స్వరాజ్యం నా జన్మహక్కు" అన్నవారు ఈ కింది నలుగురిలో ఎవరు?

ఎ) మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధి, బి) బాలగంగాధర తిలక్, సి) సుభాష్‌చంద్రబోస్ డి) జవహర్‌లాల్ నెహ్రూ. టి.వి. కార్యక్రమంలో ఆ ప్రశ్నకి సమాధానం 'అగ్నిస్థానం'లో కూర్చున్న ఆ అమ్మాయికి తెలియలేదు. ఫోన్‌లో తన 'బాస్'ని అడగడానికి అనుమతి కోరింది. ఆ ప్రయత్నం జరుగుతోంది.

నా ఆలోచన మరో వైపుకి మళ్ళింది. ఆ నాలుగు పేర్లూ పురుషులవే. మాట వరసకైనా ఒక స్త్రీ పేరు ఎందుకివ్వలేదు? ఆ రోజుల్లో సరోజినీ నాయుడు, విజయలక్ష్మి పండిట్ వంటి స్త్రీలు కూడా స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు కదా. స్త్రీలయినప్పటికీ, ఆనాటి పరిస్థితుల్లో పురుషులతో సమానంగా పోరాటంలో పాల్గొన్నారు. అటువంటి స్త్రీలలో ఒక్కరి పేరునైనా ఇవ్వవచ్చుకదా. ఇవ్వాలని తోచకపోవడానికి కారణం - స్త్రీల విషయంలో సామాజిక దృష్టి ఈనాటికీ మౌలికంగా మారకపోవడం వల్లనే. ఆలోచనలలోనే మార్పు రానప్పుడు, పరిస్థితుల్లో ఎలా వస్తుంది? భాష, సంస్కృతి, సంప్రదాయం చాలావరకు పురుషుల పరంగా రూపొందినప్పుడు, స్త్రీల పరిస్థితి మరొకరకంగా ఎలా ఉంటుంది?

ఆ 'అగ్నిస్థానం'లో ఉన్న అమ్మాయి అప్పటికే ఎనభైవేలు గెలుచుకుంది. 'గెలుచుకున్నారు!' అనలేదు. ఆ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ప్రియతమ కథానాయకుడు "ఎనభైవేలు మీ జేబులోకొచ్చాయి!" అన్నాడు. జేబు సాధారణంగా మగవాళ్ళ దుస్తులకే ఉంటుంది కదా మన దేశంలో! ఆ అమ్మాయి వయస్సుకి చిన్నదే అయినా, సంప్రదాయ బద్ధంగా చీరకట్టుకుని ఉంది. మరి, జేబు ఎక్కడుంటుంది? "మీ పర్సులోకొచ్చాయి" అని అనొచ్చు. కాని 'జేబు' అనేమాట సహజంగా వచ్చింది అతని నోటివెంట!

కెవ్వున అరిచింది నా పక్కన కూర్చున్న శివాని. ఉలిక్కిపడ్డాను. ఆలోచనల్లోంచి బయటపడి "ఏమైందే?" అన్నాను.

"గోవిందా! డెబ్భైవేలు గోవింద!" అంది తనే ఓడిపోయినంత విచారంగా.

"ఆ అమ్మాయి 'బాస్' తప్పు చెప్పాడు. అతను సరిగ్గానే చెప్పి ఉంటాడనుకుని "సుభాష్ చంద్రబోస్" అంది ధైర్యంగా.

"శభాష్!" అన్నాను నవ్వుతూ. ఆ అమ్మాయి ఓడిపోయినందుకు విచారం కన్న, ఆమె 'బాస్' తప్పు చెప్పినందుకు సంతోషం కలిగింది నాకు! కాని, అంతలోనే అనుమానం వేసింది - ఆ అమ్మాయి గెలవకూడదన్న ఉద్దేశంతో అలా చెప్పాడేమోనని. అయితే అతనికీ పరువునష్టమే కదా. ఆ( నా మొహం, ఆ మాత్రానికి పరువు నష్టం అయితే ఏమిటి?

నాకింక టి.వి. చూడబుద్ధి కాలేదు. మనసు నిండా శివాని భవిష్యత్తు గురించిన ఆలోచనలు ముసురుకున్నాయి. అందులో నా భవిష్యత్తూ లేకపోలేదు.

"నా గురించి పట్టించుకోకు. నీ భవిష్యత్తు, నీ జీవితం మరిచిపోలేను. నీ గురించి పట్టించుకోకుండా ఎలా ఉంటాను!" అంటుంది శివాని.

శివాని చదువు పూర్తయి ఉద్యోగంలో చేరేవరకూ ఎన్ని అవస్థలు పడ్డానో, ఎన్ని రకాల చాకిరీ చేశానో అది కళ్ళారా చూసింది. తండ్రి ప్రేమకి ఎన్నడూ నోచుకోలేదది. తండ్రి దేవుడి దగ్గరికి వెళ్ళాడంటే నలుగురికీ సానుభూతి ఉంటుంది. తండ్రి మరో స్త్రీ దగ్గరికి వెళ్ళిపోయాడంటే చులకన, నిరసన. 'మొగుడు వదిలి పెట్టిన స్త్రీ' అని నా మీద పడిన ముద్ర నాతో వదిలిపోతే అంత సమస్య అయి ఉండేది కాదు. ఆ చేదు అనుభవాన్ని దిగమింగి నా ఒంటరి బతుకుని నేనెలాగో భరించేదాన్ని. అది నా కూతురి జీవితాన్ని కూడా శాసించడమే దుర్భరంగా ఉంది. "పసిదాని ముఖం చూసైనా నాకు అన్యాయం చెయ్యకండి" అని కళ్ళనీళ్ళతో వేడుకున్నాను ఆనాడు నా స్వాభిమానాన్ని విడిచి. పిల్లని చూసి ఎత్తుకుంటే ఎక్కడ మమకారం పెనవేసుకుని తన కాళ్లకు అడ్డం పడుతుందో అన్నట్లు దానివైపు చూడకుండా "నీ తిండికీ బట్టకీ ఏ లోటూ రానివ్వను. అంతకన్న నేను చెయ్యగలిగిందేమీ లేదు" అంటూ తన గుండె రాయి చేసుకుని నా గుండెని ముక్కలు చేసి విదేశానికి వెళ్ళిపోయారు. భర్త విడిచిన దాన్ని పుట్టింటి వారే ఎల్లకాలం గౌరవించరు. ఇక నాకు అత్తవారి ఆదరణ ఎలా లభిస్తుంది?

కొత్తలో ఆయన అడపాతడపా పంపిన డబ్బుని మామగారే తీసుకునే వారు మా తల్లీపిల్లల పోషణ ఖర్చులకోసం. ఆ డబ్బు రావడం, ఇంట్లో నేను చాకిరీ చెయ్యడం లేకపోతే, నన్నూ నా కూతుర్నీ ఆ కొద్ది కాలమైనా అట్టి పెట్టుకునే వారు కాదు. వస్తువుల ధరలూ, మా అవసరాలూ పెరుగుతున్న కొద్దీ అత్తమామల చిత్తశుద్ధి తరిగిపోతూ వచ్చింది. మనవడు పుట్టి ఉంటే వంశోద్ధారకుడన్న కాంక్షతో దగ్గరకు తీసేవారేమో. మనవరాలిని చూస్తే, వాళ్ళకి ఎక్కడలేని చీదరా కలిగేది. దాని చిలిపి మాటలు వాళ్ళకి చిరాకెత్తించేవి. దాని ముద్దుమాటలు వినే తీరికగాని, ముద్దు చేసే ఓపిక గాని మిగిలేవి కావు నాకు ఇంటి చాకిరితో.

శివానిని స్కూల్లో వేసే రోజులు సమీపిస్తూంటే వాళ్ళ నిర్లక్ష్య ధోరణిని ఇంక భరించ లేకపోయాను. నాలుగిళ్ళలో వంట పని చేసైనా సరే నా పిల్లని పోషించి చదివించుకుంటానని చెప్పి, అత్తవారిల్లు విడిచి పుట్టింటికి చేరాను. ఆర్థిక స్వాతంత్ర్యం లేని ఆడదానికి అంతకన్న గతేముంటుంది? నా ఒంటి మీద ఉన్న నగల్ని నాన్నగారి చేతిలో పెట్టి, ముందు నాపై చదువు గురించి సాయపడమన్నాను. పిల్లని అమ్మకి అప్పజెప్పి, టీచర్స్ ట్రెయినింగుకి వెళ్ళేదాన్ని. ఇంటికొచ్చాక, పిల్లకి ఆటల ద్వారానే మాటలు నేర్పించేదాన్ని. తమ్ముడి పెళ్ళయాక, నాకు స్కూల్లో ఉద్యోగం వచ్చాక, వేరే ఇంట్లో ఒక వాటా అద్దెకి తీసుకున్నాను. శివానిని మా స్కూల్లోనే చేర్పించగలిగాను. దగ్గరుంచి చూసుకోవడానికి వీలయేది. ఇంటి వాళ్ళకి వాళ్ళ పనుల్లో అప్పుడప్పుడు సాయం చేస్తూండటంతో, వాళ్ళు నా మంచి చెడ్డలు కనిపెట్టి చూసుకునేవారు. శివానిని వాళ్ళ దగ్గర ధైర్యంగా అట్టిపెట్టి, వెళ్ళి బజారు పనులు చేసుకొచ్చేదాన్ని.

నాకు శివాని, శివానికి నేనూ తప్ప మాకు బంధువులెవరూ ఆసరాగా లేరు. ఆ అవసరం రాకుండా జాగ్రత్తపడ్డాను. నా తల్లిదండ్రులు పెద్దవాళ్ళయిపోయి, వాళ్ళే కొడుకుల మీద ఆధారపడుతున్నప్పుడు నేను వాళ్ళ మీద ఆధారపడ్డంలో అర్థం లేదు. అన్నదమ్ములికి దూరంగా ఉంటూ నా గౌరవం నేను నిలుపుకున్నాను. స్కూల్లో పనిచేస్తూనే, పిల్ల చదువు సంధ్యలు చూసుకుంటూనే, ప్రైవేటుగా బి.ఎకి కట్టాను. తరవాత సెలవుపెట్టి బి.ఎడ్. చేశాను. పిల్ల కాస్త ఎదిగేసరికి, హైస్కూల్లో ఉద్యోగం వచ్చింది. ఆ స్కూల్లోనే శివానిని చేర్పించాను. అది కాలేజి చదువు పూర్తిచేసి, పేరా మెడికల్ కోర్స్ చేసింది. మంచి ఉద్యోగం సంపాదించుకోగలిగింది దాని ప్రతిభతోనే.

'మా బతుకులు మేము బతుకుతున్నాం, మా భవిష్యత్తుని మేము నిర్మించు కుంటున్నాం" అని తృప్తి పడనివ్వదు సమాజం. "మాకు వర్తమానం, భవిష్యత్తూ తప్ప, గతం లేదు" అని మేమిద్దరం అనుకుంటే సరిపోదు అని వెక్కిరించినట్లు మాకు గతాన్ని గుర్తు చేస్తుంది. గతాన్ని తవ్వి తీస్తుంది. చేయని నేరానికి దోషులుగా చేసి నిలబెడుతుంది.

యుక్తవయస్సు వచ్చిన పిల్లకి - చదువు, ఉద్యోగం ఉన్నపిల్లకి పెళ్ళి చెయ్యాలను కోవడం నేరమా? ఆ పిల్ల పెళ్ళి చేసుకుని సుఖపడాలనుకోవడం నేరమా? ఆ పిల్లకి ఒక తల్లి ఉండటం నేరమా?

ఏ సంబంధం వచ్చినా, ముందుగా తండ్రి ఏడి అని అడుగుతారు. తండ్రి తాలూకు తక్కిన బంధువుల గురించి అడుగుతారు. పిల్ల ఉద్యోగం, రూపురేఖలూ చూసి, తక్కిన వాటికి ఎలాగో సర్దుకున్నా, కట్నం మాట ఎత్తుతారు. కట్నం ఆశ చల్లార్చాలని చూసినా, పిల్లతల్లి ఒక ఆటంకం అయిపోతోంది వాళ్ళకి. శివాని తెగేసి చెబుతోంది వాళ్ళకి "అమ్మ నా దగ్గరే ఉంటుంది" అని. అదొక్కటే అభ్యంతరం అవుతోంది. పాలగ్లాసులో విషపు చుక్క వేసినట్లుగా ఉంటోంది వాళ్ళకి.

తండ్రి పోయి, తల్లి ఒక్కర్తే ఉంటే ఆ తల్లి బాధ్యత కొడుకు తీసుకోవాలనుకోడా? అలా తీసుకోకపోతే ఆ కొడుకు మంచి వాడనిపించుకోడు. భార్య అతనికి సహకరించకపోతే స్వార్థపరురాలనిపించు కుంటుంది. కాని, తండ్రి లేనప్పుడు, ఒంటరిదైన తల్లిని దగ్గర పెట్టుకుంటానని కూతురు అంటే, ఆమెకి అడ్డు చెబుతారు. ఆ అమ్మాయికి పెళ్ళయాక ఆ బాధ్యత, హక్కూ లేవంటారు. ఆర్థికంగా స్తోమత ఉన్నా, వృద్ధాప్యంలో తమకు పిల్లలు ఆసరాగా ఉండాలనుకోవడం సహజమే కదా. కాని, కొడుకులకి ఉన్న స్వేచ్ఛ - దాన్ని ఉపయోగించుకున్నా, ఉపయోగించుకోక పోయినా - కూతుళ్ళకి మాత్రం ఉండదు. స్వేచ్ఛ కావాలని పట్టుపడితే, కావాలనుకున్న జీవితం లభించడం లేదు. "నా గురించి నువ్వు బెంగపెట్టుకోకమ్మా. ఎల్లకాలం బతకను. ఉన్నన్నాళ్ళూ నా తంటాలేవో నేను పడతాను" అంటూనే ఉన్నాను. "ఒంటరిగా నువ్వు ఎందుకు తంటాలు పడాలి? నువ్వు నా దగ్గర ఉండకూడదని షరతు పెట్టడానికి వాళ్ళెవరు?" అంటుంది. "అలా నిలదీసినట్లు మాట్లాడితే 'స్వేచ్ఛకావాలో మొగుడు కావాలో తేల్చుకో'" అంటారు. ఆడపిల్ల అత్తవారింటికి వెళ్ళడం సంప్రదాయం. ఒకసారి ఆడపిల్లని అత్తవారింటికి పంపించాక పుట్టింటి వారికి ఆడపిల్లమీద హక్కుండదు. అత్తవారికి సేవలు చేయడమే ఆడపిల్ల ధర్మం" అని గుర్తు చేశాను. "ఆడపిల్ల ధర్మం, మగవాడి ధర్మం, పుట్టింటి వాళ్ళు, అత్తింటి వాళ్ళు అని తేడాలు పెట్టి ఆడపిల్లకి అన్యాయం చేయడమేనా ధర్మం, సంప్రదాయం అంటే?" అని వాదిస్తుంది శివాని.

"మమ్మీ, మమ్మీ! ఈ ప్రశ్న చూడు!" అంది శివాని హడావిడిగా. టి.వి. కేసి చూస్తున్నప్పటికీ ఆ ప్రశ్న నా కంటికి కనిపించడం లేదు. శివాని జీవితం ముందు నిలిచిన ప్రశ్నే నన్ను సమాధానం చెప్పమంటోంది. నేను ఇన్నాళ్ళూ స్వతంత్రంగా బతికి, దాన్ని ఒక వ్యక్తిగా తీర్చిదిద్దడం వల్లనే దానికి ఈ ప్రశ్న ఎదురవుతోందా? నా భవిష్యత్తు గురించి ఆలోచించే నా కూతుర్ని చూసి గర్వించాలా, దాని భవిష్యత్తుని ప్రశ్నార్థకం చేసిన నా అస్తిత్వానికి విచారించాలా?. అయినా, నా కూతురు పెళ్ళయాక నన్ను తన దగ్గర అట్టి పెట్టుకోలేక పోతుందని బాధపడ్డం ఏమిటి? నేను నా కూతురికి సమస్యగా ఎందుకవాలి? వాళ్ళ దగ్గర అసలు నేను ఎందుకుండాలి? వాళ్ళ దగ్గర ఉంటే నా ఇంట్లో ఉన్న స్వతంత్రం నాకు ఉంటుందా? వాళ్ళకి అవసరమైనప్పుడు ఎప్పుడైనా పిలిస్తే వెళ్ళి కొన్నాళ్ళుండి రావడం బావుంటుంది - కొడుకైనా అంతే, కూతురైనా అంతే.

ఇన్నేళ్ల పాటు ఇద్దరం కలిసి బతికాం కనుక ఇక ముందు తను లేకుండా నేనొక్కర్తెనీ ఉండ లేననుకుంటోంది. ముందుగానే భయపడి భవిష్యత్తుని ప్రశ్నార్థకం చేసుకుని వర్తమానాన్ని చేజార్చుకుంటామా? శివానికి నచ్చ చెప్పాలి.

'ఆంధ్రప్రదేశ్' జూన్ 2001